క్లుప్తంగా

మురికి కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం



మురికి కాల్వ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ విజయ్‌కుమార్, సర్పంచ్ సునీత

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రజాక్‌పల్లి గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ నిధుల్లో మురికి కాల్వ పనులను జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, సర్పంచ్ సునీత ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారాయణగౌడ్, వార్డు సభ్యుడు సుభాష్, చల్మెడ సర్పంచ్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ తుమ్మల రమేశ్, నార్లాపూర్ ఎంపీటీసీ రాజిరెడ్డి, సంజీవులు, టీఆర్‌ఎస్ నాయకులు ధర్మా నాగరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, జీపీ స్వామి, భరత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వచ్ఛతే లక్ష్యం



కూచారంలో గడ్డిని తొలగిస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 299వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి ప్రకృతివనంను శుభ్రం చేశారు. ఆదివారం పలు వీధుల్లో, హరితవనంలో పిచ్చి మొక్కలను, చెత్త చెదారాన్ని తొలగించారు.

మల్కాపూర్‌లో ..

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రతీ ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆరో వార్డులో మహిళా భవనం, కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, మేకిన్ యువత ఉన్నారు.

విద్యార్థి రామ భక్తి



సీతారాములు చిత్రాన్ని గీసిన అక్షయ్

పాపన్నపేట(మెదక్): ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అయోధ్యలో అడుగిడుతున్న సీతారాముల చిత్రాన్ని గీసి రామభక్తిని చాటుకున్నాడు. మండల కేంద్రం పాపన్నపేటకు చెందిన ఆకుల అక్షయ్ పాపన్నపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని పురస్కరించుకొని కేవలం 10 నిమిషాల్లో సీతారాముల చిత్రా న్ని పెన్సిల్‌తో గీసి తన చిత్రకళను ప్రదర్శించాడు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం అయోధ్య శ్రీరామ మందిరం అక్షింతలను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వెల్మకన్న సర్పంచ్ రాజేందర్ పోలీస్ అధికారులకు పంపిణీ చేశారు.

ఉత్సవంలా నిర్వహించండి

టేక్మాల్(మెదక్): అయోధ్యలో నిర్వహించే శ్రీరామ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో ఉత్సవంలా నిర్వహించాలని మండల సంయోజక్ మోహన్ ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని దేవాలయాలను ప్రత్యేకంగా అలంకరించి దీపాలు వెలిగించాలన్నారు. దీంతో పాటూ ప్రతీ ఇంట్లో 5 దీపాలు వెలిగించాలన్నారు. హనుమాన్ దేవాలయాల్లో చందనం పెట్టడం, ఉత్సవ ర్యాలీలు, పారాయణాలు, లైవ్ టెలికాస్టులు చూడడం వంటి కార్యక్రమాలతో పాటూ దేవాలయాల వద్ద అన్నదానం చేయాలని కోరారు.

ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లి గ్రామానికి చెందిన తలారి క్షేత్ర గుండెకు సంబంధించి సమస్యతో ఇబ్బంది పడుతున్న చిన్నారికి చికిత్స నిమిత్తం జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సదానందం, హుస్సేన్, యాదగిరి, సంగమేశ్వర్ ఉన్నారు.

ఆలయాలు ముస్తాబు

జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఆదివారం ఆలయాలను భక్తులు శుభ్రం చేశారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని లైవ్‌లో చూసేలా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ సభ్యులు మట్లాడుతూ.. సోమవారం వివిధ ఆలయాల్లో శ్రీరాముడి, హనుమ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.



కొల్చారం(నర్సాపూర్): సీతారాముల విగ్రహాలకు శుభ్రం చేస్తున్న చిన్నారులు



శివ్వంపేట(నర్సాపూర్): పిల్లుట్లలో ఆలయాన్ని శుభ్రం చేస్తున్న గ్రామస్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): మహ్మద్‌నగర్‌లో ముస్తాబైన వేంకటేశ్వర ఆలయం



నార్సింగి మండల కేంద్రంలో ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం



వెల్దుర్తిలో విద్యుత్ దీపాల వెలుగులో హనుమాన్ ఆలయం



నార్సింగి మండల కేంద్రంలో ఇంటి గోడపై జైశ్రీరామ్ పెయింట్ వేస్తున్న శ్రీరామభక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): వెంకటాపూర్(ఆర్)లో ఆలయాన్ని శుభ్రం చేస్తున్న గ్రామస్తులు



మెదక్ మున్సిపాలిటీ: వార్డులో జెండాలు పంచుతున్న కౌన్సిలర్ సమియొద్దీన్

ఘనంగా మల్లన్న జాతర



మల్లన్న జాతరలో అగ్నిగుండాల్లో నడుస్తున్న పోతరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌లో మల్లికార్జునస్వామి, ఎల్లమ్మదేవి ఆలయ 16వ వార్షికోత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయ నిర్మాణ నిర్వాహకుడు శామీర్‌పేట నర్సింగారావు దంపతుల ఆధ్వర్యంలో అగ్నిగుండాలు, బండ్లు, బోనాల ఊరేగింపు తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగ్సాన్‌పల్లి, రాయిలాపూర్ సర్పంచ్‌లు ఎల్లం, శేఖులు, ఉపసర్పంచ్‌లు నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు సంజీవ్, రాజిరెడ్డి, రాజు, లింగం, నర్సింలు, రాజుయాదవ్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేశ్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పాటు పలువురు తలనీలాలు సమర్పించడంతో పాటు వాహనాలను పూజలు చేశారు. డప్పు చప్పుడు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం కనువిందుగా మారింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లు చేశారు.



చాముండేశ్వరి ఆలయంలో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారితో పాటు ఆలయంలోని బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లను దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

హైన దాడిలో లేగదూడ మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): హైన దాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన మండలంలోని సలాబత్‌పూర్‌లో జరిగింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి శ్రీశైలంకు సదరోని కుంట కింద గల పొలం వద్ద తన పశువులను రోజూ మాదిరిగా కట్టేసి రాత్రి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసే సరికి లేగదూడ కొద్ది దూరంలో పొదల మధ్యలో మృతి చెందింది. లేగదూడను పులి చంపి ఉంటుందని భావించి, ఈ విషయం గ్రామస్తులకు, అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ వెంకట్రావ్‌పేట సెక్షన్ అధికారి కరీమొద్దీన్, మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజు, బీట్ ఆఫీసర్ ఖైరున్నీస తదితరులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. లేగదూడను చంపింది పులి కాదని హైన దాడితోనే మృతి చెందిందని తెలిపారు.



సలాబత్‌పూర్‌లో మృతి చెందిన లేగదూడ మృత దేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పూజలు చేస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రామ్ అన్నారు. ఆదివారం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో బీరప్ప ఆలయం వద్ద నీటి సౌకర్యం కోసం కొత్త బోరు వేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేశ్‌సెట్, నర్సింలు, వెంకట్, చక్రపాణి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా స్వామి

చిన్నశంకరంపేట(మెదక్): ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో మండలాధ్యక్షుడిగా డప్పు స్వామిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నిమ్మగల విజయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెర్లపల్లి యాదగిరి, సుధాకర్, మురళి మాదిగ, ఎంఈఎఫ్ అధ్యక్షులు నర్సింలు పాల్గొన్నారు.



స్వామిని అభినందిస్తున్న నాయకులు

కృష్ణా నందాజీకి ఘన స్వాగతం

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో సద్గురు దామ ఆశ్రమానికి విచ్చేస్తున్న సద్గురు శ్రీ కష్ణానందాజీ మహారాజ్‌కు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సద్గురు కబీర్ సేన అధ్యక్షులు సంధ్యారాణి చత్రునాయకుల ఆధ్వర్యంలో వారితో పాటు నర్సాపూర్ పట్టణంలోని అర్చకుడు వీరప్ప, గురుస్వామి, సంజీవ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్, శివ స్వాములు పూల దండలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమం వరకు చిప్పల్‌తుర్తి ఆశ్రమం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఈ ర్యాలీలో జై కృష్ణానందాజీ మహారాజ్ జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆశ్రమం వరకు ఈ ర్యాలీ సాగింది. సద్గురు కబీర్‌సేన అధ్యక్షులు సంధ్యారాణి, చత్రునాయకుల ఆధ్వర్యంలో సద్గురు సేవా ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సద్గురు కబీర్ సేన, సేద్విప్ర సమాజ సేవ సభ్యులు నాగేందర్ గుప్తా, ఆచార్య మేధా గుప్తాజీ, రేఖా వెంకటేశం గుప్తా, వాగ్యా నాయక్, రవీందర్, మహాత్మా, రోహిత్, మహాత్మ కీర్తి, బాబూలాల్, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.



కృష్ణానందాజీ మహారాజుకు స్వాగతం పలుకుతున్న భక్తులు

భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండలంలోని కొంతన్‌పల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వృందా వ్యాలీ ఫామ్ లాండింగ్ వారు తన పట్టా భూమి కబ్జా చేశారని వంశీవర్దన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన భూమికబ్జా చేసి రోడ్డు నిర్మాణం చేపట్టారని అందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కబ్జాకు పాల్పడిన విష్ణువర్దన్‌రావు, రాజేశ్, సునీల్ ముప్పాల కుమార్, నర్సింగ్‌రావు, శ్రీసాయి, వెంకట్‌రామిరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ లాల్ షవ్య ద్రి ఉర్ఫ్ మౌలానాబాబా దర్గా వద్ద ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయిమొద్దీన్, సర్పంచ్ మహమ్మద్ ఇస్రాత్ ఫాతిమా, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, నాయకులు భిక్షపతి, మమ్మద్ చంద్రశేఖర్, బాబా భాయ్, ఆజంబాయ్, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



దర్గా వద్ద ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



శివ్వంపేట(నర్సాపూర్): బెల్టులు అందిస్తున్న ఎస్ఐ



మనోహరాబాద్(తూప్రాన్): జీడిపల్లిలో బ్లాక్‌బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): కరాటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జీడిపల్లిలో డైనమిక్ షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ ఎగ్జామ్‌లో పలువురు విద్యార్థులు రాణించారు. వీరిలో 7 గురికి బ్లాక్ బెల్ట్‌లను ఎస్ఐ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖ, నాయకులు మల్లేశ్, కనిగిరి లింగం, శేఖర్, గ్రాండ్ మాస్టర్లు కార్యదర్శి సురేశ్, ట్రెజరర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎస్ఐ రవికాంత్‌రావు అన్నారు. మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో రాయల్ షోటోఖాన్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారికి వివిధ రకాల బెల్ట్‌లు అందజేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు కరాటే నేర్చుకుంటే ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు నర్సింగ్‌రావు, సుధాకర్, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలో రహదారి నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మండలంలోని వెంకటాపూర్ గ్రామస్తులతో ఎస్ఐ బాలరాజు, కేఎన్ఆర్ ప్రాజెక్ట్ హైవే సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించడంతో పాటు, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, రాంగ్‌రూట్‌లో ప్రయాణించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఎస్ మేనేజర్ ఖాజామోయినొద్దీన్, కృష్ణయ్య, శివకుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ బాలరాజు

ఓటరు నమోదు పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఆదివారం ఓటరు నమోదు శిబిరాన్ని నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బీఎల్‌ఓలు ఉన్నత పాఠశాల ఆవరణలో ఓటరు నమోదు సవరణలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ తారాబాయ్, ఆర్ఐ శ్రీహరి, బీఎల్‌ఓలు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయండి

శివ్వంపేట(నర్సాపూర్): ఓటరు నమోదులో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. మండలంలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. గుర్తించిన పోలింగ్ నమోదు కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరించారు. కొత్త ఓటరు నమోదుతో పాటు తప్పుల సవరణ, మృతి చెందిన వారి పేర్లను తొలగించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్ఐ కిషన్, సిబ్బంది ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ఓటరు నమోదుపై మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌ఓలు ఓటర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నూతన ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులను ప్రజలు బీఎల్‌ఓలకు అందించారు. కార్యక్రమాన్ని అధికారులు పర్యవేక్షించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని ఏఎస్‌ఓ వెంకటేశ్ అన్నారు. ఆయన మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఆదివారంతో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటరు నమోదు చేయడానికి బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు నమోదుతో పాటు, మార్పులు, చేర్పులు కూడా సరి చేస్తారన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓ ధనలక్ష్మి పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వద్ద బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



చండిలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్



బండపోతుగల్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఏఎస్‌ఓ వెంకటేశ్



పెద్దశంకరంపేటలో ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్